## క్లుప్తంగా

### వృద్ధాశ్రమం తనిఖీ



వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

**డోన్ టౌన్ :** పట్టణంలోని వైఎస్ నగర్‌లో ఉన్న ఆదరణ వృద్ధాశ్రమాన్ని(పాత హోసన్నా వృద్ధాశ్రమం) సీనియర్ సివిల్ జడ్జి తంగమణి శనివారం తనిఖీ చేశారు. ఆశ్రమం పరిసరాలను జడ్జి పరిశీలించిన అనంతరం వృద్ధులతో ముచ్చటించారు. వసతులు, భోజన సదుపాయాలు, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆశ్రమ నిర్వాహకుల వ్యవహారశైలి తదితర అంశాలపై జడ్జి ఆరా తీశారు.

### డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



ద్రావణం పిచికారీ చేయిస్తున్న డాక్టర్ విద్యాసాగర్

**కోవెలకుంట్ల:** డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. మండలంలోని రేవనూరు గ్రామంలో ఇద్దరికి డెంగీ లక్షణాలు గుర్తించడంతో శనివారం ఆ గ్రామంలో వైద్య సిబ్బందితో డాక్టర్ పర్యటించారు. డెంగీ బాధితుల ఇళ్లతోపాటు, చుట్టుపక్కల 50 ఇళ్లలో దోమ లార్వాను చంపేందుకు ద్రావణం పిచికారీ చేయించారు. దోమ లార్వా వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా డాక్టర్ ప్రజలకు వివరించారు. ఖాళీ కొబ్బరి చిప్పలు, రోళ్లు, ఫ్రిజ్‌లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ విశ్వనాథం, హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, ఆశా వర్కర్లు, కుమారి, రమణమ్మ, ఎలిజబెత్ సరోజ పాల్గొన్నారు.

### మంచినీటి ఎద్దడి రానివ్వం

- మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం



నీటిలో క్లోరిన్ శాతాన్ని పరీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం

**డోన్ :** పట్టణంలో మంచినీటి ఎద్దడి రాకుండా పకడ్బందీగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణ పరిధిలోని 8వ వార్డు బీసీ హాస్టల్ సమీప ప్రాంతంలో శనివారం ఆయన డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాలతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోర్లు, మంచినీటిపైపులైన్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నీటిలో క్లోరిన్ శాతాన్ని పరీక్షించారు.


### సన్మానం



దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**బేతంచెర్ల:** పట్టణంలోని చౌడేశ్వరీ దేవి ఆలయ కల్యాణ మండప నిర్మాణానికి కర్నూలు పట్టణం చెందిన మేరు ఆటో మొబైల్స్ లిమిటెడ్ నిర్వాహకులు వర్ధన్ రాజ రామ్ మోహన్ కొడుకు జయరామ్ దంపతులు రూ. 6 లక్షల విరాళం ఇచ్చారు. ఈ మేరకు శనివారం అమ్మవారి ప్రత్యేక పూజల అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు హుసేన్ రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రఘురామిరెడ్డి సన్మానించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### గడ్డం లక్ష్మిరెడ్డి మృతికి ఎమ్మెల్యే సంతాపం



లక్ష్మిరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**అవుకు:** మండల పరిధిలోని పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన వృద్ధుడు గడ్డం లక్ష్మిరెడ్డి ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి శనివారం మృతుడి స్వగృహానికి వెళ్లి సంతాపం తెలిపారు. లక్ష్మిరెడ్డి మృతదేహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

### అక్రమ మద్యం స్వాధీనం

**సంజామల:** మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామానికి చెందిన దండే శ్రీనువాసులు మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపారు. ముక్కమల్ల, ఆల్వకొండ క్రాస్ వద్ద 30 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని దండే శ్రీనువాసులుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# అభివృద్ధి పథంలో రంగాపురం

- తీరిన ఏళ్లనాటి సమస్యలు
- సీసీ రోడ్ల నిర్మాణంతో మెరుస్తున్న కాలనీలు
- మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపురేఖలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



సుందరంగా మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,



గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



గ్రామం మీదుగా నిర్మిస్తున్న జాతీయ రహదారి



గ్రామంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్




**బేతంచెర్ల:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం అభివృద్ధి బాట పట్టింది. గత ప్రభుత్వంలో కనీస మౌలిక వసతులు కరువై ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 8,225 మంది జనాభా, 6,469 మంది ఓటర్లు ఉన్న ఆర్ఎస్ రంగాపురం గత పాలకుల నిర్లక్ష్యం మూలంగా అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారు. ఈ మేరకు ఆర్ఎస్ రంగాపురంలోనూ అభివృద్ధి పరుగులు పెట్టింది. మంత్రి బుగ్గన చొరవతో డీఎంఎఫ్, జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 2కోట్లు మంజూరు కావడంతో గ్రామంలో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రత్యేకించి సీసీ రోడ్లతో కాలనీలు మెరుస్తున్నాయి. రూ.25 లక్షలతో డోన్ ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీలోని సుంకులమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మించడంతో రహదారి సమస్య తీరింది. ఎస్సీ కాలనీ నుంచి శ్మశానవాటిక వరకు రూ. 5లక్షలు, ఆసుపత్రి ఎదుట నుంచి కోళ్ల ఫారం వరకు వాటి చుట్టూ ఉన్న వీధుల్లో మొత్తం రూ. 25లక్షలు, 6వ వార్డులో రూ.10 లక్షలు, బస్టాండు నుంచి సుంకులమ్మ గుడి వరకు రూ. 25 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల పనులు పూర్తయ్యాయి. రెండు రైతు భరోసా కేంద్రాలు పూర్తవ్వగా సచివాలయాలు, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు చివరి దశకు చేరాయి. నాడు–నేడు కింద రూ.23 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేయడంతో రూపురేఖలు మారిపోయాయి. జగనన్న కాలనీల్లోనూ గృహ నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. రూ.37 లక్షలతో 90 వేల లీటర్ల కెపాసిటీతో చేపట్టిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పనులు పూర్తవ్వగా రూ. 51 లక్షలతో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా రూ. 11.80లక్షలతో రెండు హిందూ శ్మశానవాటికలకు ఆర్చీ, ప్రహరీ నిర్మించడంతో ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం లభించింది. మంత్రి చొరవతోనే గ్రామం అన్నివిధాలుగా అభివృద్ధి బాట పట్టిందని గ్రామస్తులు బుగ్గనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

#### ఇంత అభివృద్ధి ఎప్పుడూ జరగలేదు



మా గ్రామంలో ఇంత అభివృద్ధి ఎప్పుడూ జరగలేదు. నేను కూడా గ్రామానికి 1981, 1995 రెండుపర్యాయాలు సర్పంచ్‌గా పని చేశా. ఇంత పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేపట్ట లేదు. కాలనీలు అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు పడుతుండేవారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో కాలనీలకు మహర్దశ వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.– యమసాని జగన్ మోహన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్

#### గ్రామం రూపురేఖలు మారాయి



గ్రామంలోని ప్రతి ఒక్క వీధికి సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల ఏర్పాటయ్యాయి. సచివాయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణంతో గ్రామం రూపురేఖలు మారాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణ పనులు చేపట్టడంతో సౌకర్యంగా ఉంది. సచివాలయ, ఆర్బీకే కేంద్రం సేవలు బాగున్నాయి. సచివాలయాల ద్వారా పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– నాగ శేషు, ఎంపీటీసీ సభ్యుడు

#### మంత్రి ప్రత్యేక చొరవతోనే అభివృద్ధి పనులు



ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతోనే గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి. ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల పనులు చేపట్టడంతో సౌకర్యంగా మారాయి. గ్రామ ప్రజల విన్నపం మేరకు రానున్న రోజుల్లో మిగిలిపోయిన కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రామం మీదుగా రూ. 650 కోట్లతో చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు.

– సర్పంచ్ గుమ్మ గాల్ల రాజు

### భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

**కోవెలకుంట్ల:** మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో జీర్ణోద్ధరణ గావించిన పలు ఆలయాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో మొదటి రోజు గంగానయనం, గణపతి పూజ,పుణ్యాహవచనం , పంచగవ్యప్రాశనం, రక్షాబంధనం, మాతృకా పూజ, ఋత్విగ్వరణము, యాగశాల ప్రవేశం, కలశస్థాపనం, నవగ్రహ, వాస్తు, సర్వతోభద్రాది మండల ఆరాధన, ఆవాహనములు, జప, పారాయణ, అభిషేక, అర్చలు, మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మృత్యుంగ్రహణం, అంకురారోపణం, అగ్నిప్రతిష్ఠ, దీక్షా హోమము, జలాధివాసం తదితర కార్యకమాలు జరిగాయి.

**కొలిమిగుండ్లలో...**

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని పెట్నికోట గ్రామ శివార్లలోని కాసూటి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ సందర్భంగా శనివారం విగ్రహ ప్రతిష్ఠ పూజలు నుంచి ప్రారంభమయ్యాయి. వేదపండితులు రాచకొండ పార్థసారథి శర్మ ఆధ్వర్యంలో మొదటి రోజు గణపతి పూజ, పుణ్యహవాచనం, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, జలాధివాసం తదితర విశేష పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం చివరి రోజు సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**డోన్ టౌన్ :** పట్టణంలోని సుందర్ సింగ్ కాలనీ, షాదీఖానా, కోర్టు రోడ్డు, పోలీసు స్టేషన్ ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కారణంగా ఆదివారం ఆ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**బనగానపల్లె :** వైఎస్సార్‌సీపీలోకి వలసల పరంపరలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఎస్సీ కాలనీకి చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన కుమారుడు యువనేత కాటసాని ఓబులరెడ్డిల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రెడ్డిపోగుల పక్కీరయ్య, నాగరాజు, రాజు, భాస్కర్, సుబ్బరాయుడు, సంజన్న, అనిల్, నాగరాజు, మురళీ, అర్జున్, వెంకటేశ్వర్లు మద్దయ్య, శేషమ్మ, పల్లె భాగ్యమ్మ, పల్లె తిరుపాల్, తప్పెటరాజు, తప్పట నానీ, దస్తగిరిబాషా, మహేంద్రతో పాటు మొత్తం 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువాకప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పార్టీలు, కులాలు మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కాటసాని కోరారు. కార్యక్రమంలో నాయకులు గట్టు రమేష్, సుదర్శన్‌రెడ్డి, కొనేటి దుర్గా, అత్తార్ అఖిల్‌హుస్సేన్, రసూల్, కరీం, పక్కీర తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయం


- ప్రభుత్వం చేసిన మేలును వివరించండి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి




తిమ్మనాయినపేట గ్రామస్తులతో ఎమ్మెలే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతులపాపిరెడ్డి

**కొలిమిగుండ్ల:** వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని తిమ్మనాయినపేటను శనివారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. గ్రామ నాయకులతో ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. వివిధ సమస్యలపై చర్చించారు. అనంతరం అక్కడే యర్రగుడి, హనుమంతుగుండం, నాగిశెట్టిపల్లె, బి.ఉప్పులూరు, ఉమ్మాయిపల్లె, తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె తండా, కోర్నపల్లె, అబ్దులాపురం గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించి రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన ఎన్నికల ప్రచారం తీరును ఎమ్మెల్యే వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ వ్యక్తిగత విషయాలు పక్కన పెట్టి ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే ఈసారి జరగబోయే ఎన్నికల్లో మరింత ఎక్కువ సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం ప్రతి ఇంటికీ అందజేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి కుటుంబానికి జరిగిన లబ్ధిని వివరాలతో లబ్ధిదారులకు విశదీకరించాలని సూచించారు. ఐదేళ్లలో ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ప్రజలకు వర్తించిన సంక్షేమ పథకాలు అందిన తీరును ప్రజలకు చెప్పాలన్నారు. అదేవిధంగా టీడీపీ నాయకుల మాయమాటలు, గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన తీరును గుర్తు చేయాలన్నారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త సైనికుల్లా పని చేసి వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కాటసాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలో గ్రామీణ విద్యార్థుల ప్రతిభ



భార్గవి



విద్వాన్

**బేతంచెర్ల:** డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్షలో మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన విద్యార్థులు భార్గవి, విద్వాన్ ప్రతిభ కనభరిచారు. 50 మార్కులకు గాను భార్గవి 43 మార్కులు, విద్వాన్ 42 మార్కులు సాధించి డోన్‌లోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు శివ శంకర్ రెడ్డి, ఎల్లరాజు, ప్రకృతి విద్యానికేతన్ కరస్పాండెంట్ రవికుమార్ రెడ్డి అభినందించారు.

**కొలిమిగుండ్ల:** 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదవ తరగతిలో ప్రవేశం కోసం ఈనెల 10న నిర్వహించిన పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. పెట్నికోట ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుధాకర్ గుప్త తెలిపారు. సిరి వేదిక, గాయిత్రి కోవెలకుంట్ల గురుకుల పాఠశాలకు, విష్ణువర్ధన్ డోన్ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు చెప్పారు. అదేవిధంగా అంకిరెడ్డిపల్లె ఎస్సీ ప్రాథమిక పాఠశాల, కోటపాడు, తోళ్లమడుగు, బిఉప్పులూరు, నాగిశెట్టిపల్లె గ్రామాల నుంచి ఐదు మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు.

### గ్రంథాలయం తనిఖీ



రికార్డును పరిశీలిస్తున్న సంస్థ కార్యదర్శి ప్రకాష్

**సంజామల:** మండల కేంద్రం సంజామలలోని గ్రంథాలయన్ని శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ అధికారి బాల తిమ్మరెడ్డితో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.

## జనసేన కార్యకర్తకు ఆర్థిక సాయం



గురువయ్యకు నగదు అందజేస్తున్న కాటసాని ఓబులరెడ్డి

**బనగానపల్లె రూరల్ :** మిట్నాల గ్రామ సమీపంలో ఈ నెల 21వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పట్టణంలోని ఈద్గా నగర్ కాలనీకి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త రామ గురువయ్య ఆచారిని శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు, వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి పరామర్శించారు. తనవంతు సాయంగా రూ.15వేలను రామగురువయ్యకు అందజేశారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని ఓబులరెడ్డి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అత్తార్‌జాహెద్, బూత్ కన్వీనర్ గౌండ మహబూబ్ బాషా, గౌండ కంబగిరి, అత్తార్ అఖిల్‌హుస్సేన్, గోపి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

### క్షయ నివారణపై అవగాహన



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ రాంభూపాల్

**డోన్ రూరల్ :** మండల పరిధిలోని యు.కొత్తపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ రాంభూపాల్ అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ రాంభూపాల్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. రెండు వారాల పాటు దగ్గు, గల్లలో రక్తపు చారికలు రావడం, జ్వరం, బరువు తగ్గడం వంటివి క్షయ లక్షణాలు అని చెప్పారు. ఈ లక్షణాలు ఉంటే వెంటనే ఆశ వర్కర్లను కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం క్విజ్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ అరుణ్‌కుమార్, కరిముల్లా, ఐసీటీసీ కౌన్సిలర్ శేషన్న, ఏఎన్ఎం లత, సీహెచ్ఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.


### ప్రత్యామ్నాయంగా రహదారి ఏర్పాటు చేయాలి

**డోన్ టౌన్ :** పట్టణ సమీపంలోని వెంకటనాయుని పల్లె రోడ్డులో నిర్మిస్తున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ప్రత్యామ్నాయంగా రోడ్డు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొయిలకొండ నాగరాజు కోరారు. శనివారం బ్రిడ్జి నిర్మాణం ప్రాంతాన్ని సీపీఎం నాయకులతో కలిసి సందర్శించిన ఆయన ప్రత్యామ్నాయంగా రోడ్డు లే నందన 9 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లు స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

### మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.5.65 లక్షలు

**బేతంచెర్ల:** మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివార్లో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికీ ఫాల్గుణ మాసం శనివారం పురస్కరించుకొని తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవల ద్వారా రూ. 5,65,221 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

## ఉద్యమకారులను ఆదర్శంగా తీసుకోవాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

**డోన్ రూరల్ :** స్వాతంత్య్ర పోరాటంలో యక్తవయసులోనే ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వంటి ఉద్యమకారులను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకుడు రామాంజినేయులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో శనివారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు రామాంజనేయులతోపాటు ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాయుడు తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణతేయాదవ్, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

**డోన్ టౌన్ :** స్వాతంత్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కొత్తపేట ప్రభుత్వ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రుడు, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ పిలుపునిచ్చారు. స్థానిక పాఠశాల్లో శనివారం భగత్ సింగ్,సఖ్‌దేవల వర్థంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్, సుఖ్‌దేవ్ చేసిన పోరాటాలను వారు గుర్తు చేశారు.

**బేతంచెర్ల:** దేశం కోసం 23 సంవత్సరాల వయసులోనే ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు మధు శేఖర్, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్ 93 వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు భాస్కర్, ప్రదీప్, ఎల్ల క్రిష్ణ. బాలజీ, దుర్గ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర బలగాలతో కవాతు

**బేతంచెర్ల:** సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం కేంద్ర బలగాలతో మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, బలపాలపల్లె గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.

### గుండె పోటుతో ప్రయాణికుడి మృతి

**డోన్ రూరల్ :** యశ్వంత్‌పూర్– కాచిగూడ రైలులో శనివారం ప్రయాణిస్తున్న ఎల్లయ్య(58) గుండె పోటుతో మృతి చెందినట్లు ప్రయాణికులు తెలిపారు. పాములపాడు మండలానికి చెందిన ఎల్లయ్య బెంగుళూరు నుంచి కర్నూలుకు రైలులో ప్రయాణిస్తుండగా డోన్ వద్దకు రాగానే గుండె నొప్పికి గురయ్యాడు. వెంటనే అంబులెన్స్‌లో డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు ఎల్లయ్య అప్పటికే మృతి చెందారని నిర్ధారించారని చెప్పారు.

### నాటుసారా స్వాధీనం

**అవుకు:** మండల పరిధిలోని రామాపురం గ్రామంలో 40 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కిరణ్ బాబు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన సాత్రి బాలనాగమ్మ గ్రామ సమీపంలోని సాయిబాబా ఆలయం వెనుకల సారా అమ్ముతుండంతో దాడి చేశామన్నారు. పోలీసులను చూసి నిందితురాలు పారిపోయిందన్నారు. అక్కడ ఉన్న సారాను స్వాధీనం చేసుకుని నిందితురాలిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పరీక్షా కేంద్రాల తనిఖీ

**డోన్ టౌన్ :** పట్టణంలో జరుగుతున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకురాలు గంగాభవానీ శనివారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల్లో ఇంటర్ ఏ,బీ పరీక్ష కేంద్రాలు, పాతపేట జెడ్పీ హైస్కూల్లో టెన్త్ పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం పట్టణ సమీపంలోని కస్తూర్బా గురకుల పాఠశాలను సందర్శించారు.